'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# జైలా, బెయిలా, బీజేపీయా?



టంకశాల అశోక్

ఈ నెల 4వ తేదీ నాటి పత్రికలలో ఒక శీర్షిక చాలామందిని ఆకర్షించి ఉంటుంది. అది, 'జైలా, బెయిలా తేల్చుకోండి' అన్నది. ఆ ప్రకటన చేసిన వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఆయన అంతకుముందు 3వ తేదీన తమ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి లోక్‌సభ ఎన్నికల గురించి మాట్లాడుతూ అవినీతి ప్రస్తావన చేశారు. అవినీతిపరులపై చర్యలకు తాను కట్టుబడి ఉన్నానంటూ, దేశంలో అవినీతిపరులకు రెండే అవకాశాలున్నాయని, వారు జైలా, బెయిలా అనేది తేల్చుకోవాలని సూచించారు.

అయితే, అవినీతిపరులని భావించేవారికి మూడో అవకాశం కూడా ఉందని చెప్పటం ఆయన మరిచిపోయినట్టున్నారు. అది, బీజేపీలో చేరటం. సదరు అవకాశం స్వయంగా ఆ పార్టీ ప్రభుత్వం కల్పించినటువంటిదే. దేశవ్యాప్తంగా అవినీతి ఆరోపణలకు గురై, ఈడీ, సీబీఐ, ఐటీ కేసులను ఎదుర్కొంటున్న అనేకులు బీజేపీలో చేరగానే ఏ విధంగా కేసుల నుంచి విముక్తి పొందుతున్నారో, లేదా పార్టీకి భారీగా ఎన్నికల బాండ్లను సమర్పించుకోగానే కేసుల ఒత్తిడి లేకుండాపోతున్నదో చూపే పరిశోధనాత్మక కథనాలు వరుసగా వెలువడుతున్నాయి. ఈ మూడో అవకాశం ఎట్లాగూ అందరికీ తెలిసిందే గనుక తాను మళ్లీ ప్రత్యేకంగా ప్రకటించటం ఎందుకని ఆయన ఊరుకున్నట్టున్నారు.




బహుశా అది కూడా నిజం కాకపోవచ్చు. జైలా, బెయిలా తేల్చుకోండి అని ప్రత్యక్షంగా హెచ్చరించటంలోని పరోక్ష ఉద్దేశం.. 'మీకు మూడో అవకాశం కూడా ఒకటున్నది, అదేమిటో మీకు తెలుసు, కనుక దానిని ఎంపిక చేసుకొని సుఖంగా ఉండండి' అని చెప్పటం మోదీ వంటి వ్యూహకర్త పరమోద్దేశం అయి ఉండాలి. అవినీతిపరులు జైలుకు పోయినా, లేక బెయిల్ పొందినా బీజేపీకి కలిగే లాభం ఏమున్నది గనుక. అవినీతి నిర్మూలన, అవినీతిపరులకు శిక్షలు మోదీ ఉద్దేశం అయి, అందుకాయన నిజంగానే కట్టుబడి ఉంటే తన పరిపాలనా పద్ధతి మరొక విధంగా ఉండేది. ఆయన 2014లో జాతీయ రాజకీయాలలో ప్రవేశించి బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎన్నికల ప్రచారం చేసినప్పుడు చేపట్టిన ప్రచారాంశాలలో ఒకటి అవినీతిని అరికట్టడం. అప్పుడాయన ఎక్కడికి వెళ్లినా సభలలో 'న ఖావూంగా, నా ఖానే దూంగా' (తినను, తిననివ్వను) అని దృఢంగా ప్రకటిస్తూ దేశ ప్రజలకు వాగ్దానం చేసేవారు. ఆ మాట ప్రజలను బాగా ఆకట్టుకోవటానికి ఒక కారణం ఉంది.

అంతకుముందు 2004 నుంచి 2014 వరకు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై, యూపీఏ భాగస్వామ్య పక్షాలపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. బొగ్గు గనులు, 2జీ స్పెక్ట్రం కుంభకోణాల వంటివి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వాన్ని కుదిపేశాయి. వ్యక్తిగతంగా ప్రధాని మన్మోహన్ నీతిపరుడని చెప్తూ, ఆ ప్రతిష్ట పేరుతో ఆయన ప్రభుత్వ అవినీతిని కప్పిపెట్టజూశారు గానీ అది ప్రజల దృష్టిలో చెల్లుబాటు కాలేదు. బోఫోర్స్ కేసు సందర్భంలో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ వ్యక్తిగతంగా దోషి కాదనే వాదన ఎట్లాగైతే కాంగ్రెస్‌ను కాపాడలేకపోయిందో, ఈసారి కూడా అదే జరిగింది. ఇటువంటి నేపథ్యాల మధ్య 2014లో మోదీ ఇచ్చిన 'న ఖావూంగా, న ఖానే దూంగా' అనే ఆకర్షణీయమైన నినాదాత్మక హామీ ఓటర్లపై చాలా ప్రభావం చూపింది. ఆ తర్వాత కాలానికి సంబంధించి వివరమైన చర్చలోకి ఇక్కడ వెళ్లలేము గానీ, కొన్ని విషయాలను పేర్కొనాలి. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రపంచ దేశాలలో 2015లో మన అవినీతి ర్యాంకింగ్ 61 కాగా, 2022లో 85కు, 2023లో 93కు పతనమైంది. ఇవి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ లెక్కలు.

దేశ ప్రజలకు మోదీ చేసిన ఒక ఆకర్షణీయమైన వాగ్దానం స్విట్జర్లాండ్‌తో సహా ఇతర దేశాలలోని రహస్య బ్యాంకు ఖాతాలలోని నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ప్రతి భారతీయుని ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేయగలనని. అది జరుగక పోగా ఇప్పుడా ప్రస్తావన అయినా చేయటం లేదు. ఆ నల్లధనం ఇంకా పెరిగిపోతున్నదని, మారిషస్ వంటి రూట్లలో దానిని ఇక్కడికి తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారని, ఇటువంటివారితో బీజేపీకి సంబంధాలున్నాయని విమర్శకుల ఆరోపణ.

టీడీపీ ఎంపీగా ఉండి బీజేపీలో చేరిన ఒకరిపైనా ఈ ఆరోపణలు ఉండటం తెలిసిందే. బీజేపీలో చేరగానే ఆ కేసులు ఏమైనదీ తెలియదు. ఇది చాలదన్నట్టు, తమ రూ.15 లక్షల వాగ్దానం కేవలం ఎన్నికల మాట అని సాక్షాత్తూ హోంమంత్రి అమిత్ షా ఆ తర్వాత ప్రకటించారు. ఇక, పెద్దనోట్ల రద్దుతో అవినీతి సొమ్ము అంతా బయటకు రాగలదనే వాదన ఒట్టి బోగస్‌గానే తేలటం తెలిసిందే. మరొక వైపు ఈ కాలమంతా బీజేపీ ఆశ్రిత పెట్టుబడిదారుల సంపదలు ఎంత శరవేగంగా పెరుగుతూ వస్తున్నాయో కూడా తెలిసిందే.

అవినీతిపై ప్రధాని మోదీ గత పదేండ్లుగా సాగిస్తూ వస్తున్న పోరాట చరిత్రకు ఇవి కొన్ని మచ్చుతునకలు. ఇటువంటి మహత్తర పోరాట నేపథ్యం నుంచి ఆయన 'జైలా, బెయిలా' హెచ్చరికను చూడవలసి ఉంటుంది. ఇక్కడ ప్రధానంగా రెండు విషయాలు మనసుకు వస్తాయి. ఒకటి, దర్యాప్తు సంస్థల నుంచి అవినీతి కేసులు ఎదుర్కొంటున్నవారు బీజేపీలో చేరిన వెంటనే ఆ కేసులు రద్దు కావటం, లేదా దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పడిపోవటం. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు. అవి అనేక పత్రికలలో వస్తున్నవే కూడా. అయినప్పటికీ 3వ తేదీ నాటి ప్రధానమంత్రి ప్రతిజ్ఞతో ఒక సందర్భం వచ్చినందున మరొకమారు చెప్పుకొందాం. రెండవది, ఎన్నికల బాండ్లు. ఇటీవల సుప్రీం కోర్టు ఆ చట్టాన్నే రద్దు చేయటంతో పాటు, వరుస ఉత్తర్వులతో స్టేట్‌బ్యాంక్ మెడలు వంచి దారికి తెచ్చేవరకు రహస్యంగా సాగిన ఆ లావాదేవీలలో బీజేపీ ఏ విధంగా లాభపడిందో కనీసం ఒక మేరకు దేశం గమనించింది. అన్ని వివరాలకు సంబంధించిన పరిశోధనలు ఇంకా సాగుతున్నాయి. మోదీ ప్రభుత్వం 2017లో ఆ పథకాన్ని తెచ్చినప్పుడు చెప్పినమాట, రాజకీయ పార్టీలకు కంపెనీలు గానీ, వ్యక్తులు గానీ ఇచ్చే విరాళాలు ఇక పారదర్శకంగా ఉండగలవని. అవినీతి చోటుచేసుకోబోదని. కానీ అందుకు విరుద్ధంగా అంతా రహస్యంగానే సాగటం ఒకటైతే, ఏ విధంగా కంపెనీలను, వ్యక్తులను బెదిరించి, కేసులను ఒక ఆయుధంగా ప్రయోగించి, కాంట్రాక్టులను సాధనాలుగా ఉపయోగించి బాండ్లు సంపాదించారనేది రెండవది. ఈ చీకటి కోణాలపై పరిశోధనలు ఇంకా సాగుతున్నాయి.

విషయం ఏమంటే, ఇటువంటి పచ్చి అవినీతి వ్యవస్థకు అధ్యక్షుడైన మోదీ.. జైలా, బెయిలా చెప్తూ, అవినీతిపరులకు గల అవకాశాలు రెండేనని, తాను అవినీతిని ఎంతమాత్రం సహించబోనని, అవినీతిపరులపై చర్యలు తీసుకొని తీరగలనని భీకరమైన ప్రకటనలను అలసట లేకుండా, విన్నవారు ఏమనుకోగలరన్న భీతి లేకుండా చేస్తున్నారు. బాండ్ల సొమ్ము బీజేపీకి ఎవరి నుంచి ఎప్పుడెప్పుడు ఎంతవచ్చింది, అందుకు గల సందర్భాలు ఏమిటనే వివరాలు ఇప్పటికే అనేకం బయటకువచ్చాయి. పరిశోధనలు పూర్తయి అంతా తెలియవచ్చినప్పుడు, బీజేపీ నీతి ప్రవచనాలు, ఆచరణల గురించి దేశం మరింత తెలుసుకోగలదు.

ఇటువంటిదే ఈడీ, సీబీఐ, ఐటీ కేసులు, బీజేపీలో చేరికలు, తదనంతరం కేసు మాఫీల ఉదంతం. ఇది 'వాషింగ్ మెషిన్' తంతుగా కూడా పేరుగాంచింది. ఈ వివరాలు ఇటీవల వెల్లడవుతున్నవే అయినా, ఢిల్లీ కేంద్రంగా వెలువడే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తాజా కథనాన్ని చూడండి. దాని ప్రకారం.. మోదీ మనకు నీతి పాఠాలు చెప్పి అధికారానికి వచ్చిన 2014 నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నాయకులలో 25 మంది బీజేపీలో చేరగా, అందులో 23 మందికి విముక్తి లభించింది. వారిలో అజిత్ పవార్, హిమంత బిశ్వశర్మ, సువేందు అధికారి, సీఎం రమేశ్, నవీన్ జిందాల్, దిగంబర్ కామత్, ఛగన్ భుజ్‌బల్, అశోక్ చవాన్, తాపస్ రాయ్, సుజనా చౌదరి, ప్రఫుల్ పటేల్, బీఎస్ బొమ్మై, శివరాజ్‌సింగ్ చౌహాన్, నారాయణ రాణే, జనార్దనరెడ్డి, పెమా ఖండూ వంటి హేమాహేమీలున్నారు.

మరొక విశేషం చూసి ఆశ్చర్యపోకండి. ఆర్థిక సంబంధమైన నేరాల దర్యాప్తులు కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోకి వస్తాయి. ఆ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్. ఆమె కొద్దిరోజుల కిందట ఒక ఇంగ్లీష్ చానల్ అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ.. అవినీతి ఆరోపణలు ఉన్నవారైనా, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్నవారైనా, ఎవరినైనా సరే తమ పార్టీలోకి స్వాగతిస్తామని ప్రకటించారు. ఈ ప్రశ్నలను పదేపదే వేసినా కూడా ఆమె అదే సమాధానాన్ని ఎంతో నిశ్చలంగా, దృఢంగా చెప్పారు. అది విన్నవారికి ఊపిరి బిగపట్టి నమ్మశక్యం కానట్టు తోస్తే అది ఆమె బాధ్యత కాదు. ఆ విధానం తనది కాదు గనుక. ఆ విధానం జైలా, బెయిలా తేల్చుకోండి అని నిందితులను హెచ్చరిస్తూ, ఈ రెండు మార్గాలే కాదు, మూడవది కూడా ఉంది సుమా అనే సుస్వాగత సూచనలు చేసేవారిది.

---

ఆయన మాట ఓ ధీమా. ఆయన పలుకు ఓ భరోసా. ఆయనుంటే గుండె నిబ్బరం. ఆయనే ఉద్యమ సారథి, స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్. స్వరాష్ట్ర కలను సాకారం చేసిన కేసీఆర్ కోసం నాడు ప్రజలే కాదు, తెలంగాణ ఉద్యమమే ఎదురుచూసింది. నాడైనా, నేడైనా కేసీఆరే ప్రజలతో పాటు తెలంగాణకు ధైర్యం. నాడు ఉమ్మడి పీడను వదిలించిన ఆ ధైర్యమే.. నేడు స్వరాష్ట్రంలో మన ప్రాంతానికి పట్టిన పీడను వదిలించేందుకు మరోసారి ఉద్యమ జెండా ఎత్తుకోవాలని తెలంగాణ ఆకాంక్షిస్తున్నది.

# బలమైన రాజకీయ శక్తి కేసీఆర్



సంపత్ గడ్డం
78933 03516



పోరాటంలో వెన్ను చూపని, వెనుకడుగంటే ఏమిటో తెలియని నేత వెంట నడవాలని.. ఆరు గ్యారెంటీల మాయలో పడి మోసపోయిన ప్రజానీకం పరితపిస్తున్నది. తూటాల్లాంటి మాటలను మరోసారి ఎక్కుపెట్టాలని కోరుతున్నది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాప్రయోజనాలే పరమావధిగా పనిచేసే కేసీఆర్ మరోసారి ప్రశ్నల సునామీగా మారి కాంగ్రెస్‌ను ముంచెత్తాలని అభిలషిస్తున్నది.

కేసీఆర్ అంటేనే ప్రశ్నల దండు. ఆయన ధాటిని తట్టుకోవడం ఎంత కష్టమో కాంగ్రెస్‌కు తెలిసినంతగా మరెవరికి తెలుసు. అందుకే నేడు కేసీఆర్ ప్రశ్నిస్తుంటే.. కాంగ్రెస్ నేతలు జడుసుకుంటున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక సతమతమవుతున్న పాలకులు.. 'మేము ధైర్యంగా ఉన్నాం' అని పైకి చెప్పుకొనేందుకే కేసీఆర్‌పై తిట్ల దండకం అందుకుంటున్నారు.

కేసీఆర్‌కు సమస్యలపై ప్రశ్నించడం తెలుసు.. పరిష్కార మార్గాలు తెలుసు. కేసీఆర్ రాజకీయ శక్తి మాత్రమే కాదు, సమాజాన్ని అధ్యయనం చేసిన ఒక మహోన్నత వ్యక్తి. ప్రజల ఆవేదనలు తెలిసిన నాయకుడు, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత కలిగిన జననేత. ఆయన ఏదైనా అనుకుంటే సాధించి తీరుతారు. కేసీఆర్ కంటే ముందు చాలామంది తెలంగాణ ఉద్యమాన్ని నడిపినా చివరికి పదవులకో, ప్రలోభాలకో లొంగిపోయారు. కానీ, కేసీఆర్ మాత్రం రాజీనామాలనే ప్రధానాస్త్రంగా చేసుకొని, ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి స్వరాష్ట్రాన్ని సాధించారు.

కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవు. అధికారం కోసమే ఆ పార్టీల ఆరాటం. కేసీఆర్‌ను ఎదుర్కొనే శక్తి లేకనే, తెలంగాణలో బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ.. ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. ఉద్యమ కాలం నుంచి ఎన్నో కష్టాలను అలవోకగా ఎదుర్కొన్న ఆయనకు ఈ పరిస్థితి కొత్త కాదు. ప్రజాగొంతుక కేసీఆర్‌ను ఆపటం ఎవరి తరం కాదు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే బీజేపీ సర్కార్‌కు సామాన్యుల బాధలు పట్టవు. 'పేదల కడుపు కొట్టి పెద్దలకు పెట్టే' ఆ పార్టీ విధానాన్ని కేసీఆర్ ఎప్పటికప్పుడు ఎండగడుతూ వస్తున్నారు. మోదీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతూనే ఉన్నారు. బీసీ కులగణన చేపట్టకపోవడం, ఎస్సీ వర్గీకరణపై దాటవేత, రైతు వ్యతిరేక చట్టాలు తదితర అనేక ఉదాహరణలు మన కండ్ల ముందే ఉన్నాయి.

తెలంగాణతో పాటు దేశాభివృద్ధిపై కేసీఆర్‌కు ఉన్నంత అవగాహన మరెవరికీ లేదు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు అనేక జాతీయ సమస్యలపై ఆయన ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు. రైతు వ్యతిరేక చట్టాల రద్దు కోసం జరిగిన ఉద్యమంలో కూడా కేసీఆర్ చురుగ్గా పాల్గొన్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలను మాతృభాషల్లో నిర్వహించాలని విద్యార్థుల తరఫున కేసీఆర్ గొంతెత్తడంతో కేంద్రం దిగిరాక తప్పలేదు. తెలుగు భాషను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కించపరిచినప్పుడు మొదటగా స్పందించింది కూడా కేసీఆరే.

పదేండ్లుగా సుభిక్షంగా ఉన్న మన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు ఎందుకొచ్చింది? ఇది పాలకులు ఉద్దేశపూర్వకంగా తెచ్చిన కరువు కాదా? కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ నాలుగు నెలల్లో 200 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 'కేసీఆర్ సారూ! నువ్వు రావాలి.. మా ఆకలి తీరాలంటే నువ్వే గెలవాలి' అంటూ నల్గొండ జిల్లాలోని ముషంపల్లికి చెందిన రైతు మల్లయ్య ఆవేదనతో మాట్లాడిన తీరు అందరినీ కలచివేసింది. తెలంగాణ పల్లెలన్నీ ఇప్పుడు కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్నాయి. అందుకే రైతులకు భరోసా ఇవ్వడానికి రైతు బాంధవుడు కేసీఆర్ కదిలారు. పొలంబాట పట్టారు. కర్షకుల కన్నీళ్లను తుడుస్తున్నారు. పొలంబాట పట్టిన కేసీఆర్‌కు హారతులు ఇచ్చి మరీ అన్నదాతలు స్వాగతిస్తున్నారు. ఓ వైపు పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతన్నలకు కేసీఆర్ అండగా నిలుస్తుంటే.. మరోవైపు 'రైతుబంధు రాలేదని చెప్పే రైతులను చెప్పుతో కొట్టండి' అని కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం సిగ్గుచేటు. ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ఇటు సమాజానికి, అటు తెలంగాణకు మంచిది కాదు.

ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంట్‌లో తెలంగాణ గొంతును వినిపించేందుకు బలమైన నాయకత్వం అవసరం. బీఆర్ఎస్‌ను మించిన తెలంగాణ గొంతుక ఇంకొకటి లేదన్నది అందరికీ తెలిసిందే. తెలంగాణపై జరిగే కుట్రలు, రాజకీయ కుతంత్రాలను సమర్థంగా తిప్పికొట్టే బలమైన పార్టీ బీఆర్ఎస్సే. ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ప్రజాగొంతు మూగబోయినట్టు అయింది. కనీసం పార్లమెంట్‌లోనైనా మన గొంతు వినిపించాలంటే బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో గెలవడం తప్పనిసరి.

కేసీఆర్ తీసుకునే ప్రతీ నిర్ణయంలోనూ తెలంగాణ, దేశ భవిష్యత్తు ఉంటుంది. ఇప్పుడు దేశానికి బలమైన నేత అవసరం. అందుకే ఆయనతో జట్టు కట్టేందుకు జాతీయ నేతలు ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ ఎవరి ఆలోచనలకు అందని అపర చాణక్యుడు. వ్యూహకర్తలతో అధికారంలోకి రావాలని ప్రణాళికలు వేస్తున్న పార్టీలకు తెలియదేమో.. కేసీఆర్ అందరినీ మించిన వ్యూహకర్త అని. ఆయన మౌనం, సహనం వెనుక పరమార్థం ఉంటుంది. రేపటి భవిష్యత్తు ఉంటుంది. గర్జించే ప్రజాగళాన్ని తట్టుకొని పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలవాలంటే కాంగ్రెస్, బీజేపీ శక్తికి మించి పని చేయకతప్పదు.

---

# న్యాయాన్నే గెలిపించిన వకీల్‌సాబ్

కరీంనగర్, జగిత్యాల ప్రాంతాల్లో పుట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహనీయులు ఎందరో ఉన్నారు. తమ తమ రంగాల్లో రాణిస్తూ పేరు ప్రఖ్యాతులు సాధించిన వారెందరో. సాహితీవేత్త గుండి గోపాలరావు, వెలిచాల కొండల్‌రావు, వెలిచాల జగపతిరావు, చెన్నమనేని సోదరులు అలాంటి కోవకు చెందినవారే. వారి వరుసలోనే వృత్తి ధర్మానికి మానవీయతను జోడించి పేదల 'వకీల్‌సాబ్'గా ప్రశంసలందుకున్నారు జగిత్యాలకు చెందిన ప్రముఖ న్యాయవాది ఎం.హనుమంతరావు.



బి.నర్సన్
94401 28169


నివాళి

అరవై ఏండ్లకు పైగా న్యాయవాదిగా సేవలందించిన వకీల్ సాబ్.. ఎనిమిది పదుల వయసులోనూ న్యాయాన్ని గెలిపించేందుకు పోరాడటం విశేషం. ఎందరో జూనియర్లను ఉత్తమ న్యాయవాదులుగా తీర్చిదిద్దిన హనుమంతరావు మార్చి 29న తుది శ్వాస విడిచారు.

జగిత్యాలకు సమీపంలోని అంతర్గాంలో జన్మించిన హనుమంతరావు నాగ్‌పూర్‌లో న్యాయ విద్యను అభ్యసించారు. చదువు పూర్తి చేసుకున్న తర్వాత 1960లో ప్రాక్టీసు ప్రారంభించిన ఆయన మొదట్లో రెండేండ్ల పాటు హైకోర్టులో కేసులు వాదించారు. ఆ తర్వాత తండ్రి కోరిక మేరకు జగిత్యాలకు మకాం మార్చిన ఆయన అన్యాయానికి గురవుతున్న బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచారు. జగిత్యాల, కరీంనగర్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తూ అణగారిన వర్గాల గొంతుకగా మారారు. జగిత్యాలలో బార్ అసోసియేషన్‌ను ప్రారంభించి, చాలాకాలం పాటు దానికి అధ్యక్షుడిగా కొనసాగారు. జగిత్యాలలో ఒకటే కోర్టు ఉండటంతో కేసుల సంఖ్య పెరిగి, తీర్పులు ఆలస్యంగా వస్తుండటాన్ని ఆయన గమనించారు. ఆలస్యంగా వచ్చే న్యాయం అన్యాయంతో సమానమని భావించిన హనుమంతరావు జగిత్యాలలో మరో కోర్టు అవసరం ఉందని ప్రభుత్వానికి విన్నవించారు. పట్టుబట్టి మరీ న్యాయశాఖను ఒప్పించారు. అలా జగిత్యాలలో అదనంగా సీనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయడంలో ఆయన ఎనలేని కృషి చేశారు. కొత్త కోర్టు రాకతో కేసుల విచారణ వేగవంతమై పేదలకు సత్వరమే న్యాయం అందింది.

జగిత్యాలలో రెండు పర్యాయాలు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తించిన హనుమంతరావు.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలవారు భూ తగాదాలతో సతమతమవుతున్నట్టు గమనించారు. తగాదాల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఆయన సొంత ప్రాక్టీసు మొదలుపెట్టారు. సివిల్ కేసులు స్వీకరిస్తూ ఎందరికో న్యాయాన్ని అందించారు. మొదట కేసు పూర్వాపరాలను తెలుసుకొని.. న్యాయం ఎటువైపు ఉంటే అటువైపు నిలబడటం ఆయన ప్రత్యేకత. డబ్బుల కోసం తప్పుడు కేసులను వాదించడం ఆయన నైజం కాదు. అందుకే తప్పులు చేసినవారు, పేదలను ముంచినవారు ఆయన దరిదాపుల్లోకి కూడా వెళ్లేవారు కాదు. ఈ క్రమంలో ఫీజులు తీసుకోకుండానే ఆయన వాదించిన కేసులెన్నో ఉన్నాయి.

1962లో జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న మాకునూరు ధర్మారావు వకీలు హనుమంతరావుకు సమీప బంధువు. వకీలు తలుచుకుంటే రాజకీయాల్లోకి వెళ్లడం పెద్ద విషయం కాదు. కానీ, మొదటి నుంచి హనుమంతరావుకు రాజకీయాల పట్ల ఆసక్తి లేదు. అందుకే ఆయన అటువైపు వెళ్లలేదు. సొంతూరికి ఎంతో సేవ చేసిన ఆయన గ్రామ రాజకీయాల్లోనూ తలదూర్చలేదు. హనుమంతరావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఈయన కుమారుడే. సంజయ్ రాజకీయ ప్రవేశానికి కూడా హనుమంతరావు మొదట విముఖత చూపారు. అయితే కంటి వైద్యుడైన సంజయ్ కుమార్ సామాజికసేవా కార్యక్రమాలు చేశారు. వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు సేవ చేయాలనే దృఢ నిశ్చయంతో ఉన్న సంజయ్‌కుమార్ తండ్రి ఆమోదం కోసం తీవ్రంగా ప్రయత్నించి, చివరికి సఫలమయ్యారు.

విలక్షణమైన వ్యక్తిత్వం, నిజాయితీ, నిబద్ధత కలిగిన హనుమంతరావు ఎన్నడూ ప్రచారాన్ని కోరుకోలేదు. నిజానికి ఎమ్మెల్యే సంజయ్‌కు పితృవియోగం అనే కన్నా.. పేదల న్యాయవాది హనుమంతరావు అస్తమయం అని అనడం సబబేమో. ఎంతో మందికి న్యాయ సేవలందించిన ఆయన పేదల వకీల్ సాబ్‌గా ఎప్పటికీ గుర్తుండిపోతారు.

---

# ఎటమటం




## బీ ఫామ్ మరీ ఇంత అగ్గువా?

'నకల్ మార్నెకో బీ అకల్ రహనా' అన్నది ఉర్దూ సామెత. కాపీ కొట్టడానికి కూడా తెలివి ఉండాలన్నది దీని సారాంశం. చిన్న లాజిక్ మిస్ అయిన సైబర్ నేరగాళ్లు పప్పులో కాలేశారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించిన వారికి ఫోన్లు చేసిన సైబర్ నేరగాళ్లు.. ఏఐసీసీ నుంచి మాట్లాడుతున్నామని నమ్మిస్తూ 'మీ బీ ఫామ్ సిద్ధమైంది. రూ.76 వేలు ఎక్స్‌ట్రా ఫోన్ పే చేస్తే దాన్ని వాట్సాప్‌కు పంపిస్తామని చెప్పారట. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఎంపీ టికెట్లకు కోట్లకు కోట్లు ధర పలుకుతుండగా.. మరీ ఛీప్‌గా రూ.76 వేలు ఏంది? అని కడియం శ్రీహరికి అనుమానం వచ్చిందట. కాంగ్రెస్ బీ ఫామ్‌లు మరి ఇంత అగ్గువకు అమ్ముతున్నారా? అని ఆయన ఏఐసీసీ నేతలకు ఫోన్ చేసి అడగగా.. సైబర్ నేరగాళ్ల తెలివి తక్కువతనం బయటపడింది.




## బీర్లున్నాయి.. నీళ్లే లేవు!

వేసవిలో నీటి ఎద్దడి మామూలే. అయితే ఆ ప్రభావం పెండ్లిలు, ఎంపీ ఎన్నికలపై పడటం మాత్రం ఇదే తొలిసారి. కర్ణాటకలో బీర్లు అయినా దొరుకుతాయి, కానీ మంచినీళ్లు దొరికే పరిస్థితి లేదని వార్తలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన ఒక పెండ్లిలో మంచినీళ్లకు బదులుగా బీర్లు అందించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. అలాగని ముమ్ముందు బీర్లకు ఢోకా లేదనుకుంటే పప్పులో కాలేసినట్టే. నీటికొరత కారణంగా బీర్ల తయారీ ఫ్యాక్టరీలకు నీళ్ల సరఫరా చేయలేమని కర్ణాటక అధికారులు చేతులెత్తేశారు. ఈ సమాచారం ఎంపీ అభ్యర్థులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. 'డబ్బులది ఏముందిలే అన్నా! బీర్లు పంచిన పార్టీకే ఓటు వేస్తాం' అని ఓటర్లంటే తామెక్కడికి పరుగెత్తేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



## రాములమ్మకు క్యా హువా?

రాములమ్మ అసలు కాంగ్రెస్ పార్టీలో ఉందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కార్యక్రమాల్లో ఆమె ఎక్కడా కనిపించడం లేదు. రాములమ్మ బొత్తిగా నల్లపూస అయిపోయారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కమలం పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరినప్పుడు కొంత హడావుడి చేసినప్పటికీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె ఊసే ఎక్కడా కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి నిరాకరించిన ఆమె.. ఎంపీగా బరిలో దిగనున్నట్టు అప్పట్లో మీడియాకు సూచనప్రాయంగా చెప్పారు. కానీ, ఆ దిశగా కనీసం టికెట్ కోసం కూడా ప్రయత్నించలేదు. ఈ విషయం తెలియక కొందరు రాములమ్మ ఇంటికి వెళ్లి వినతిపత్రాలు ఇస్తున్నారట. అధికార పార్టీలో ఉన్నప్పటికీ ప్రస్తుతం తాను యాక్టివ్‌గా లేనని వారికి చెప్పలేక ఆ వినతి పత్రాలను సీఎం పేషీకి పంపించి రాములమ్మ చేతులు దులుపుకొంటున్నట్టు వినికిడి.



## 'పరివార్' వాది!

ప్రధాని మోదీ మొదలుకొని బీజేపీలో చోటామోటా నాయకుల వరకు తమ రాజకీయ ప్రత్యర్థులపై పరివార్ వాదిగా ముద్ర వేస్తుంటారు. కానీ, విచిత్రంగా కర్ణాటక బీజేపీ ప్రస్తుతం ఈ ఆరోపణ వల్ల ఆత్మరక్షణలో పడింది. బీజేపీ అగ్రనేత, మాజీ సీఎం యడియూరప్ప కుటుంబ పాలన ఆరోపణలతో సతమతమవుతున్నారు. ఆయన కుమారుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్టు మాజీ డిప్యూటీ సీఎం ఈశ్వరప్ప సంచలన ప్రకటన చేశారు. ఈ విషయాన్ని అమిత్ షాకు చెప్తామని ఢిల్లీకి వెళ్తే, తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, ఇక ఆయన స్వయంగా పిలిచినా వెళ్లే ప్రసక్తే లేదని, బీజేపీలో కుటుంబ పాలనపై ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నట్టు ఈశ్వరప్ప బీజేపీని హెచ్చరించారు.

- వెల్జాల